
# శుభకార్యేషు మంత్రి

కథ

**భమిడిపాటి సోమయాజి**



మధుమూర్తికి హఠాత్తుగా మెళుకువ వచ్చింది. టైమ్ చూసాడు. తెల్లారకట్ల నాలుగైంది. సాధారణంగా ఒకసారి నిద్రపోతే ఉదయం ఏడు గంటల దాకా నిద్ర లేవడు. ఏభై అయిదు సంవత్సరాలు వచ్చినా అలాగే నిశ్చింతగా నిద్రపోతాడు. నిద్రలోనే నిశ్చింత! మెళకువగా వున్నంతసేపూ ఏవో ఆలోచన్లే! అందరి గురించీ ఆలోచించేవాళ్ళకి నిత్యం, ఎల్లవేళలా ఆలోచన్లుంటాయి. ఎవరైనా ''నీకు నిశ్చింతగా నిద్రపడుతుందయ్యా! మాకైతే వయస్సు పెరిగినకొద్దీ నిద్ర తరుగుతోంది'' అంటే మధుమూర్తి సమాధానం-

''భగవంతుడికి, ఎవరికి ఏమియివ్వాలో తెలుసు. నాకున్న సమస్యలకీ సరిగ్గా నిద్ర పోలేదనుకో నా ఆరోగ్యం క్షీణిస్తుంది. అసలు ఆ మాటకొస్తే, ప్రాణికోటికి నిద్ర భగవంతుడిచ్చిన ఒక వరం! అన్ని విషయాలు మరిచి ఆదమరిచి నిద్రపోతే ఆ మర్నాడు అన్ని పనులూ సక్రమంగా నిర్వర్తించవచ్చు.''

మధుమూర్తికి ప్రస్తుతం వచ్చిన విషమ సమస్య తన కొడుకుని, తన భార్య చెప్పినట్లు యింజనీరింగ్ చదివించడమా లేదాని. తన కూతురు గురించి దాచిన డబ్బు యింజనీరింగ్ చదివించడానికి ఖర్చయిపోతే, దాచిన లక్ష రూపాయలు మళ్ళీ పోగుచెయ్యగలడా! ఎన్నాళ్ళో కష్టపడి తన సుఖాలను, సుఖాలేమిటి? కనీసం అవసరాలను కూడా వదులుకుని దాచిన డబ్బది! ఇంక ఎలాగా నిద్ర పట్టదని, లేచి కాఫీ పెట్టుకుని తాగాడు. అలా ఆలోచిస్తూ కుర్చీలో కూర్చున్నాడు.

మధుమూర్తి భార్య మాధవి కూడా లేచింది. మళ్ళీ ఈ యింజనీరింగ్ ప్రస్తావన తెస్తుందని ''ఇంకా అయిదవలేదు. కాస్సేపు నిద్రపో! ఈవేళ ఆదివారం కదా! నాకు శెలవురోజు'' అన్నాడు.

''మీ స్కూలుకి శెలవే కాని మీ మనస్సుకి శెలవనేది లేదుకదా! ఇద్దరం కలిసి కాఫీ తాగుదాం'' అంటూ మంచం దిగింది మాధవి.

కాఫీ గ్లాసు చేతికిచ్చి, మొదలుపెట్టింది.

''అది కాదండీ! అన్నింటికీ భయపడితే ఏ పనీ చెయ్యలేం. వాడు యింజనీరయితే, వాడి చెల్లెలి పెళ్ళికి సహాయం చెయ్యడా! భగవంతుని దయవలన ఈ ఊళ్ళోనే ఉద్యోగమొస్తే, యిక చెప్పేదేముంది. నెలకు కనీసం ఏడెనిమిది వేలైనా వెనకెయ్యొచ్చు. దానితో పిల్ల పెళ్ళి సులువుగా చెయ్యొచ్చు!''

''బాగుంది నువ్వు చెప్పేది. వెనకటికెవరో లా స్టూడెంట్‌ని యింటి అద్దె ఇమ్మంటే, తన లా కోర్స యిపోయి, ఎప్రెంటిస్ పూర్తయి, లాయరయి, మంచి కేసులు రెండుమూడు రాగానే, అద్దె యిచ్చేస్తానన్నాడట!''

''ఇదెక్కడో చదివిన జోక్‌లా వుంది.

అయినా మనకి సొంత అభిప్రాయాలు లేవుకదా! 'కార్యేషు మంత్రి' అన్నారు. నేను చెప్పినట్లు వినండి. సంసారం బాగుపడుతుంది. ఏమిటో దురదృష్టం. స్కూల్లో మంచి పాఠాలు చెప్పే మాస్టారుగా పేరు సంపాదించిన మీకు, నేను పాఠాలు చెప్పవలసి వస్తోంది'' అంది మాధవి.

''అవున్లే! ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి. జీవితమంతా మేము నేర్చుకుంటూనే ఉంటాం. అలా నేర్చుకుని, నేర్చుకుని, నేర్పే స్థితికి ఎదిగాం. సర్లేకానీ నీమాట కాదని, నేను సుఖంగా ఎలా ఉంటాను'' అని పిల్లాడ్ని యింజనీరింగ్‌లో చేర్చడానికే నిర్ణయించాడు మధుమూర్తి.

★ ★ ★

మొత్తంమీద మధుమూర్తి మాధవీ దంపతుల పుత్రరత్నం యింజనీరింగ్ చదువు నిమిత్తం పొరుగూరు హాస్టల్‌లో మకాం పెట్టాడు. మధుమూర్తి మాస్టారు దాచిన లక్షలో ఏభై వేలు 'బిల్డింగ్' ఫండ్‌కి కట్టారు. మిగిలిన ఏభై వేలతో యింజనీరింగ్ కోర్సు రెండు సంవత్సరాల వరకూ అయింది. కష్టపడి తెల్లారగానే ట్యూషన్లు చెప్పడం మొదలుపెట్టారు మాస్టారు. ఈ ధనార్జన నిమిత్తం నిత్య పూజలు మానేసారు.

ఆయనకి రాను రాను, దేహదారుఢ్యం తగ్గుతోంది. అలా అతి కష్టంమీద కుర్రాడి యింజనీరింగ్ పూర్తి అయింది.

★ ★ ★

ఒకరోజు పొద్దున్నే మాధవి పెద్దన్నగారు వచ్చారు. ''ఏమిటయ్యా! చెప్పాపెట్టకుండా హఠాత్తుగా విచ్చే

శావు'' అని నవ్వుతూ పలకరించారు బావమరిదిని.

''ఏముంది బావగారూ! ఏదైనా శుభానికి సంబంధించిన విషయాన్ని స్నానం చేసి, దేవుని పూజ ముగించుకుని చెప్తే మంచిది'' అన్నాడు బావమరిది.

'ఈ మహానుభావుడు బహుమేధావి, విషయాన్ని చెప్పకనే చెపుతున్నాడు. తన కూతుర్ని ఈ యింటి కోడలిగా చెయ్యడానికి వచ్చి వుంటాడు' అనుకున్నారు మాస్టారు.

మాస్టారి ఊహ తప్పు కాలేదు.

స్నానాదులు ముగించుకొని తన కూతుర్ని దయతో మాస్టారి కొడుక్కి చేసుకోమని అడిగాడు.

''ఏమిటయ్యా నువ్వు! మొన్ననే కదా వాడి యింజనీరింగ్ పూర్తయింది. ఇంకా, వాడు ఉద్యోగం వెతుక్కోవాలి. తన కాళ్ళమీద తను నిలబడితే కదా, యింకొకరికి ఆశ్రయం కల్గించగలడు. అయినా, నాకు కూడా పెళ్ళీడుకి వస్తున్న పిల్ల ఉంది కదా! ఈ యిద్దరిలో అసలెవరి పెళ్ళి ముందు చెయ్యాలో మేమింకా నిర్ణయించుకోలేదు'' అన్నారు మాస్టారు.


అప్పటికి ఆ ప్రస్తావన ఆపేద్దామని, మాధవి ''అన్నయ్యా! ప్రయాణ బడలికతో వుండి వుంటావు. అన్నం తిని కాసేపు విశ్రమించు. సాయంకాలం మాట్లాడదాం'' అంది.

అన్నం తిని, అన్నగారు పడుకున్న తర్వాత మళ్ళీ మధుమూర్తి మాస్టారికి పాఠాలు మొదలుపెట్టింది మాధవి.

''అదేమిటండీ! వాడు గంపెడు ఆశతో వచ్చి పిల్లనిస్తానంటే, మీరు వాడికి అలా క్లాసు తీసుకున్నారు. మా మేనకోడలు బంగారుబొమ్మ! సాక్షాత్తూ లక్ష్మీదేవిలా వుంటుంది. సిరి వస్తూంటే, మోకాలు అడ్డుపెడతారేమిటి? పిల్ల వచ్చిన వేళ, గొడ్డొచ్చిన వేళ అంటారు. ఈ పిల్లని చేసుకుంటే మంచి ఉద్యోగం దానంతటదే వస్తుంది. ఇంజనీరింగ్ చదివించడం విషయంలో కూడా మీరు చాలా అధైర్యపడ్డారు. నే చెప్పినట్లు విన్నారు. కుర్రాడు లక్షణంగా యింజనీరయ్యాడు కదా! ఇప్పుడు కూడా నా మాట వినండి. బాగుపడతాం! 'కార్యేషు మంత్రీ' అన్నారు కానీ అసలు 'శుభ కార్యేషు మంత్రీ' అనవలసింది'' అని ముగించింది మాధవి.

''ఏమిటో నాకర్థం కావటం లేదు. పెళ్లయిన తర్వాత స్కూల్లో తప్ప నేను నోరు విప్పడానికి కుదరటం లేదు. పెళ్ళిచూపుల్లో గొంతు వణికిస్తూ మాట్లాడితే ఏదో భయస్తురాలవ్వూ, మితభాషిణివీ అనుకున్నాను. ఏకు మేకై కూర్చున్నావ్!'' అన్నారు మాస్టారు.

''అలా మేకునని జడపదార్థంతో పోల్చకండి. లక్షణమైన తెల్లని వన్నె కలదాన్ని. నల్లని మేకుతో పోలుస్తారేమిటి? ఆడదాన్ని కనుక ఆడపిల్ల పెళ్ళి ఎంత కష్టమో తెలిసి, మనకీ ఒక ఆడపిల్ల వుంది కదా అని నేను చెప్పాను. వాడు మీ కొడుకు, మీ యిష్టం. మీ



## అనుకోని మలుపు

**అసలే ఇండస్ట్రీ అంతా సమస్యల మయంగా ఉన్న తరుణంలో ఎన్టీయార్ మరో వారసుడు కళ్యాణ్‌రామ్ నటించి నిర్మించిన 'అతనొక్కడే' హిట్ కావడంతో పరిశ్రమ కథలు, కథనాల గురించి చర్చించడం మొదలుపెట్టింది. ఈ చిత్రంలో కళ్యాణరామ్, సింధుదులానీ నటనకి ప్రశంసలు కూడా లభించాయి. 'ఐతే' చిత్రంతో ఆరంగేట్రం చేసిన ఈ భామ ఇప్పుడు తెలుగు నిర్మాతల దృష్టిని ఆకర్షిస్తోంది.**

కుటుంబంలోకి బయటనుంచి వచ్చినదాన్ని. నా యిష్టం ఎలా చెల్లుతుంది యిక్కడ'' అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

చిన్నప్పటినుంచీ తెలిసిన పిల్లే కనుక పిల్లవాడి అభిప్రాయం కూడా తీసుకుని, సంబంధం ఖాయం చేసుకున్నారు. ఉద్యోగం రాకుండానే వివాహమైపోయింది యింజనీర్ కుర్రాడికి.

★ ★ ★

మంచి కంపెనీలో ఉద్యోగం కూడా వచ్చింది. మాధవి ఆనందానికి అంతులేదు. ''నే చెప్పలేదండీ! మా మేనకోడలు లక్ష్మీదేవే! పిల్లాడికి పెళ్లయిన వెంటనే మంచి ఉద్యోగం వచ్చింది చూశారా!''

''పోల్లే మేనత్త పోలిక రాలేదు. చాలా సంతోషం'' అని చమత్కరించారు మాస్టారు, కుర్రాడికి మంచి ఉద్యోగం వచ్చిందన్న సంతోషంతో.

''ఇక మన పిల్ల పెళ్లయిపోతే మనం ధన్యులం'' అంది మాధవి.

''ఎందుకవదూ! శుభ కార్యేషు మంత్రివి నువ్వున్నావు కదా!'' అన్నారు మాస్టారు.

మాస్టారు దిగులుగా వున్నారు. కట్నాలు చూస్తే చాలా విపరీతంగా వున్నాయి. దాచిన డబ్బయిపోయింది. కట్నం లేకుండా ఎవ్వరైనా దయతో తన పిల్లని చేసుకున్నా కనీసం డెబ్బయి వేలుంటేనే కాని పెళ్ళవదు. ఇదే మాట మాధవితో అంటే ''ఏం కంగారుపడకండీ! పిల్లాడికి దగ్గర ఊళ్ళోనే కదా ఉద్యోగం. రోజూ వెళ్ళి వస్తూంటాడు. డబ్బు కూడబెట్టి పెళ్ళి చేసేద్దాం'' అంది.

ఉద్యోగం వచ్చిన రెండు నెలలకి కుర్రాడ్ని ఆంధ్రప్రదేశ్ నుంచి మహారాష్ట్రకి బదిలీ చేశారు. దీంతో మాస్టారు కృంగిపోయారు. 'అసలీ పిల్ల పెళ్ళి చెయ్యగలమా!' అని దిగులు పట్టుకుంది మాస్టారికి. ఇలా ఆర్నెల్లు గడిచాయి.

ఒకరోజు తన భార్యను పిలిచి తన బాధంతా చెప్పుకున్నారు. ''కంగారుపడకండి. మీరు వెళ్ళి ఆ కంపెనీ యజమానితో ఒకసారి మాట్లాడి మన కష్టాలు చెప్పండి. అబ్బాయిని దగ్గర ఊళ్ళో వేస్తారేమో'' అంది మాధవి. కార్యేషు మంత్రి సలహా మేరకు ఆ కంపెనీ యాజమాన్యాన్ని స్వయంగా వెళ్ళి కలిశారు మాస్టారు. ఆశ్చర్యం! అక్కడ జనరల్ మేనేజర్ చిన్నప్పుడు మాస్టారి దగ్గర చదువుకున్నవాడే. మాస్టారుతో-

''ఇదంతా మీరు పెట్టిన భిక్షే'' అంటూ చాలా గౌరవించాడు. గురువుగారి కొడుకుకి సంబంధించిన పర్సనల్ ఫైల్ తెప్పించి చూశాడు. అతను తనంతట తానే మహారాష్ట్రకి అడిగి బదిలీ చేయించుకోవడం వలన ఏం చెయ్యలేని తన అశక్తతని వ్యక్తం చేసి, మాస్టార్ని పెద్ద మనసుతో తనని క్షమించవలసిందిగా ప్రార్థించాడు.

విషయం తెలుసుకున్న మాస్టారు నిశ్చేష్టులైపోయారు. తిరుగు ప్రయాణమయ్యారు. కాలం ఎంత మారిపోయింది. మనుషులెంత స్వార్థంగా ప్రవర్తిస్తున్నారు! ఇంటి విషయాల్లో బాధ్యత లేకుండా ప్రవర్తించే యిటువంటి కొడుకుల వలన తల్లిదండ్రులకి కలిగే వ్యథ ఊహించి చాలా బాధపడ్డారు. అసలీ పిల్లలకి పరిపక్వత వస్తుందా అని మథనపడ్డారు. ఇలా బస్సులో ఆలోచిస్తున్న మాస్టారికి తమ గమ్యం వచ్చినా తెలీలేదు. ''మాస్టారూ మన ఊరొచ్చింది'' అన్న మాటలు రెండవసారి చెపితే కాని వినబడలేదు.

ఇంటికి వచ్చిన మాస్టార్ని ''కాయా! పండా!'' అని అడిగింది మాధవి.

జరిగిన విషయం చెప్పి, భార్య మనస్సుని గాయపరచడం ఇష్టంలేని మాస్టారు గంభీరంగా ''కాయ పరిపక్వమైతే పండవుతుంది'' అని ముక్తసరిగా చెప్పారు.

ఆయన మాటలు అర్థం కాలేదు కాని, యిందులో ఏదో గూఢార్థముందని మాత్రం గ్రహించింది మాధవి.

☆